విశాలాంధ్ర

ప్రకాశం, బాపట్ల జిల్లాలు

సోమవారం 20 జనవరి 2025 | 8 పేజీలు

మనిషి జీవితాన్ని మార్చేది 'కళా రంగం'

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర – యద్దనపూడి : మనిషి జీవితాన్ని మార్చగల సత్తా కళారంగానికి ఉంటుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో గత నాలుగు రోజుల నుంచి ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు విజయవంతంగా ముగిశాయి. పోటీల్లో భాగంగా ఎమ్మెల్యే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేశారు. ఆత్మీయ అతిథిగా ఏపీ క్రియేటివ్ కల్చర్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజస్విని హాజరయ్యారు. సభాధ్యక్షులు కందిమళ్ల సాంబశివరావు వ్యవహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కళమ్మ తల్లి ముద్దుబిడ్డగా తెలుగు వాడి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని, కళా రంగం ద్వారా సమాజానికి మంచి జరుగుతుందన్నారు. కళాపరిషత్తులు నిర్వహించటం ఎంతో వ్యయ ప్రయాసాలతో కూడుకున్న పనని అన్నారు. తేజస్విని మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవితం గడిపితే ఆ జీవితము ఎంత విజయం సాధిస్తుందో అన్న దానికి నందమూరి తారకరామారావు నిదర్శనమన్నారు. సృజనాత్మక కలిగిన కొందరు నటులు కష్టపడి, ఇష్టపడి, సృష్టించిన కళ నాటిక రంగం,16వ శతాబ్దంలో నాటిక రంగం

మిగతా 2 లో ...



నారాయణ స్వామి దేవస్థానంలో పూజలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో నారాయణ స్వామికి అత్యంత పవిత్రమైన రోజైన ఆదివారం నారాయణస్వామి దేవస్థానంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ముందుగా నారాయణ స్వామి మూల విరాట్‌కు పూజలు నిర్వహించిన అనంతరం పంచామృతాభిషేకం, గోపూజ అనంతరం మహా నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఏర్పాట్లను పర్య వేక్షించారు. నారాయణస్వామి దేవస్థానం శాశ్విత చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, దేవస్థాన నిర్వహణ అర్చకులు మహంకాళి ప్రసాద్ శర్మ, మన్నేపల్లి శ్రీనివాసులు, మన్నేపల్లి కార్తీక్, కొమ్మినేని వెంకటరావు, బోయన మనోజ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి మానవతా సంస్థ చేయూత

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన పునుగుపాటి విజయరావు కుటుంబానికి దర్శికి చెందిన మానవతా సంస్థ చేయూతనిచ్చింది. అందులో భాగంగా ఆదివారం విజయరావు కుటుంబ సభ్యులను కలిసి పదివేల రూపాయల నగదును అందజేశారు. వివరాలు ఇలా ఉల్లగలు ఎస్సీ కాలనీకి చెందిన పునుగుపాటి విజయరావు కుటుంబం కాయ కష్టం చేసుకుని జీవిస్తున్నారు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దర్శి మానవతా సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, ఆ సంస్థ డైరెక్టర్ రెడ్డి మాస్ రాఘవులు తన సొంతంగా 5000 రూపాయలతో పాటు, మానవత సంస్థ 5000 రూపాయలు మొత్తం కలిపి పదివేల రూపాయలను విజయరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి వారి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. మానవతా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు ధని రెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, జె సుశీలమ్మ, జైహింద్ రెడ్డి, గ్రామ సర్పంచి జనమాల నాగేంద్రం పిచ్చయ్య, బిక్షాల్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీది రాజ్యాంగ వ్యతిరేక పాలన

- అమిత్ షాకు మంత్రిగా కొనసాగే హక్కు లేదు
- ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం తీసుకొచ్చేందుకు అడుగులు
- ఒంగోలు నిరసన కార్యక్రమాల్లో వామపక్ష నాయకుల ధ్వజం

విశాలాంధ్ర- ఒంగోలు :

పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని వామపక్ష నాయకులు ధ్వజమెత్తారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట విజయవాడలో అమిత్‌షా పర్యటనను నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని ఆదివారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ దేశంలో అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగాన్ని తెచ్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రణాళిక అబద్ధంగా అడుగులు వేస్తుందని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే కేంద్ర హోంశాఖ మంత్రి పార్లమెంటులో భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడారన్నారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలనలో తమ వైఫల్యాలను కప్పుపుచ్చేందుకు ప్రజల మధ్య కుల మత విద్వేషాలు రెచ్చగొడుతూ తమ పాలన సాగిస్తుందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం అధికారంలోకి వచ్చిన బిజెపి, అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానపరిచేలా ప్రవర్తించడం బిజెపి సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. ఇప్పటికైనా బిజెపి అధిష్టానం స్పందించి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బే షరతుగా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.వీరారెడ్డి, ఎస్డి సర్దార్, సీపీఐ ఒంగోలు సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, డీహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు నాయకులు చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, జాల అంజయ్య, బి.రఘురాం, కంకణాల ఆంజ నేయులు, కంకణాల రమాదేవి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చిట్టి పాటి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు ఎస్ లలిత కుమారి పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించండి

విశాలాంధ్ర - తాళ్లూరు :

మండలంలోని రామభద్రాపురంలో రీ సర్వేకు రైతులు సహకరించాలని మండల సర్వేయర్ శ్రీనివాస రావు కోరారు. సోమవారం నుండి రామభద్రాపురం రెవిన్యూ పరధిలో రీ సర్వే జరుగుతుందని చెప్పారు. రైతులకు ఇప్పటికే తెలిపామని, వీఆర్‌ఎల ద్వారా నోటీసులు పంపామని తెలిపారు. రైతులు తమ పాస్ పుస్తకాలను, వారి వద్ద పొలానికి ఉన్న ఆధారాలను తీసుకురావలని చెప్పారు. ఎల్ ఎల్ ఆర్ లో ఉన్న విస్తీర్ణం, తమ పొలం ఆన్లైన్ లో ఉన్న విస్తీర్ణం, అనుభవంలో ఉన్న విస్తీర్ణం సరిపోయేలా ఉన్నాయా లేవా అన్న విషయాలను గమనించి సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మనిషి జీవితాన్ని మార్చేది 'కళా రంగం'

(మొదటిపేజీ తరువాయి)

పుట్టిందని, ఆనాటిక రంగం ఇప్పటికీ ప్రజల ఆదరణ పొందుతుందని, నాటిక రంగం నుంచి సినిమా రంగం పుట్టిందన్నారు. నాటిక రంగానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. కళాపరిషత్తుల ద్వారా నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను అభినందిస్తూ గౌర వించడం అభినందనీయమని పాండురంగారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో గుదే తారకరామారావు, కొరిటాల వంశీకృష్ణ, మద్దినేని జయరామకష్ణ, పెడవల్లి శ్రీనివాసరావు, పోపూరి శివసుబ్బా రావు,నిమ్మల సాం బశివరావు,పెడవల్లి వెంకటేశ్వర్లు, మండవ శ్రీనివాసరావు పాపూరి హనుమంతురావు, పోపూరి సాంబశివరావు, రావి శ్రీనివాసరావు, నల్లపనేని రంగయ్య చౌదరి, కనిపర్తి నాగేశ్వరరావు, రాయపాటి సీతయ్య, వజ్జా సుబ్బరామయ్య, సింగ్ చంద్రశేఖర, దొడ్డ అప్పారావు, కర్లపూడి నారాయణస్వామి, కోయ సతీష్, వంకాయపాట్టి సుబ్బారావు, ఆర్.వరదబాబు, గుదే శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌పై వైసీపీ విష ప్రచారం

- ఒక్క అవకాశం అంటూ విద్యుత్ వ్యవస్థ విధ్వంసం
- సూర్యఘర్ పథకం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- నాణ్యమైన విద్యుత్ సరఫరా చూసి ఓర్వలేకున్న జగన్
- ఢిల్లీ స్థాయిలో తెలిసిన జగన్ విధ్వంసం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - బల్లికురవ :

ఒక్క అవకాశం అంటూ ప్రజలను మోసం చేసి గత ఐదేళ్లు అధికారం చేపట్టిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి నెట్టడమే కాకుండా ఎస్సీ, ఎస్టీలకు అందించే ఉచిత విద్యుత్ విషయంలోనూ విష ప్రచారం చేస్తున్నారని

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. దళిత, గిరిజనుల ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు అంటూ వైసీపీ నేతలు సాక్షి పత్రికలో ప్రచారం చేయడాన్ని మంత్రి ఖండించారు.గత ఐదేళ్లు విద్యుత్ వ్యవస్థపై కక్ష పెట్టుకున్న జగన్ దానిని విధ్వంసం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనా అనుభవంతో అనతికాలంలోనే సరిదిద్దారని ఆయన తెలిపారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు 9 గంటలు నిరంతరాయ విద్యుత్‌తో పాటు ప్రజలకు నాణ్యమైన కరెంట్‌ను ఎటువంటి అంతరాయాలూ లేకుండా కూటమి ప్రభుత్వం అందించడాన్ని చూసి జగన్ తట్టుకోలేక పోతున్నాడన్నారు.ఫీడర్ లెవల్‌లోనే రైతులకు అందుతున్న నాణ్యమైన విద్యుత్‌ను జగన్ అండ్ కో వైసీపీ బ్యాచ్ తమ అసత్య ప్రచారాలతో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని త్వరలోనే రాష్ట్రం అంతటా అమలు చేస్తామని ప్రకటించారు. అదే విధంగా సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర ఫలకాలను ఉచితంగానే అమర్చుతున్నామని తెలిపారు. ఎటువంటి అదనపు భారాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుతో జగన్‌కు వచ్చిన నష్టమేంటే ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి సవాలు విసిరారు.

జగన్ విధ్వంసం..కేంద్ర పెద్దల దృష్టికి

గత ఐదేళ్ల పాలన సాక్షిగా జగన్ చేసిన విధ్వంసం కేంద్ర పెద్దల ద్రుష్టికి కూడా వెళ్లిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.దేశంలో జరిగే అభివృద్ధి సంబంధ విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ముందు ఉంటారని ఆయన వెల్లడించారు.అదే విధంగా ఎటువంటి మంచి పథకంపైన అయినా విషం చిమ్మి వ్యవస్థలను నాశనం చేసే విషయంలో జగన్ ముందు ఉంటాడని ఎద్దేవా చేశారు.గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జగన్ గర్వంగా చెప్పుకునే పథకం ఒక్కటైనా ఉందా అంటూ వైసీపీ నేతలను మంత్రి ప్రశ్నించారు. కేంద్ర,రాష్ట్ర ప్రాయోజిక పథకాలైన సూర్య ఘర్,పీఎం కుసుమ్ అమలుతో విద్యుత్ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు.సూర్యఘర్ పథకంలో విద్యుత్ గృహ వినియోగదారులకు, పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులకు సంబంధించి వ్యవసాయ వినియోగానికి నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు మిగులు కరెంట్‌ను గ్రిడ్‌కు పంపి వినియోగదారులు ఆర్థికంగా వెసులుబాటు పొందే అవకాశం కూడా ఉందని వెల్లడించారు.పథకాలు పూర్తి స్థాయి అమలు తరువాత వాటి ప్రయోజనాలు మరింతగా ప్రజలకు చేరతాయని మంత్రి స్పష్టం చేశారు. అవినీతిలో కూరుకుపోయిన గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను కూటమి ప్రభుత్వం అందిపుచ్చుకుని ప్రజలకు లబ్ధి చేకూరేలా వాటిని అమలు చేస్తుంటే ఓర్వలేని వైసీపీ సాక్షి పత్రికను అడ్డం పెట్టుకుని సంక్షేమ పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.ఇటువంటి విష ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని పిలుపునిచ్చారు.

నిత్యం రోడ్డు ప్రమాదాలు

ట్రాఫిక్ నిబంధనలపై అలసత్వం

- మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వైనం
- హెల్మెట్ ధారణపై ఇంకా అవగాహన రాహిత్యమే..

విశాలాంధ్ర-పీసీపల్లి : నిత్యం రోడ్డు ప్రమాదాల రూపంలో కొనసాగుతున్న మరణమృదంగానికి వాహనదారులు హెల్మెట్లు ధరించకపోవడం అతిగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడపడమే కారణమవుతున్నాయి.

మద్యంమత్తు కారణంగా ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితాలు అనుకూలంగా రావడంలేదు. రోజురోజుకు ప్రమాదాల సంఖ్య పెరుగుతుండడంతో పోలీసులు కఠిన వైఖరి అవలంభిస్తున్నారు. నిత్యం శ్వాస నిర్ధారణ పరీక్షలు చేసి తాగి వాహనాలు తోలుతున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదవని వాహనదారులకు నిత్యం వివరిస్తూనే ఉన్నారు. అయినా ఎవరు ఈ ఆంక్షలు అవలంభించడం లేదు. పెద్దలు యువత అక్షరాస్యులు నిరక్షరాశుల సైతం అందరు ఇదే తీరును వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అనుసరించటం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం సేవించి రోడ్లపైకి వాహనాలతో వస్తామంటే ఇక కుదరదు పొమ్మంటున్నారు. ఈ నేపథ్యంలో నిత్యం పోలీసులు తనిఖీలు నిర్వహించటం వాహన చోదకులు బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేయడం చేపడుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి నిబంధనలను అతిక్రమించవద్దని పోలీసులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులపైనా ప్రమాణాలు సైతం చేస్తున్నారు. బెదిరించినా భయపెట్టినా తీరు మారకపోతే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారి డ్రైవింగ్ లైసెన్స్ వాహన పత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు. మద్యం సేవించి ఒంటరిగా వాహనాన్ని నడుపుకుంటూ వెళితే వాహనాన్ని సైతం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదే ఇద్దరు వ్యక్తులు వాహనంపై వెళితే అందులో ఒకరు మద్యం సేవించకపోతే ఆ వ్యక్తి సొంత పూసికత్తుతో వాహనాన్ని అప్పజెప్పుతున్నారు. ఆపై కోర్టులో హాజరపరిచి జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాం

పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య

మద్యం మత్తులో వాహనాల నడుపుతున్నడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలి మండల ముఖ్య కేంద్రాల్లో గ్రామాల్లో ఎప్పటికప్పుడు వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం. వీరికి జరి మానాతో పాటు జైలు శిక్ష సైతం విధించే అవకాశం ఉంది ప్రజలందరూ మద్యం సేవించి వాహనాలు నడపకుండా సురక్షితంగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ గమ్యస్థానాలకు చేరాలని కోరుకుంటున్నాను.

ముగిసిన క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని వెంగళాపురం ఎస్సీ కాలనీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో వివిధ గ్రామాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వెంగళాపురం ఎస్సీ కాలనీ బైయనపాలెం జట్లు తలపడగా వెంగళాపురం ఎస్సీ కాలనీ జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బైయనపాలెం నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. అనంతరం 93 పరుగుల విజయ లక్ష్యంతో ఇన్నింగ్స్ ఆరంభించిన వెంగళాపురం ఎస్సీ కాలనీ 9 ఓవర్లలో లక్ష్యాన్ని చేదించి ఘనవిజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన వెంగళాపురం ఎస్సీ కాలనీ జట్టుకు మొదటి బహుమతి పెద అలవలపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర ప్రియ శిష్యుడు నాగోతి శ్రీనివాసులు రూ 20,116 అందజేశారు. రన్నర్‌గా నిలిచిన బైయనపాలెం జట్టుకు వెంగళాపురం యూత్ ఫోర్స్ రూ 10,116 ప్రైజ్ మని అందజేసి వారిని అభినందించారు. వారు మాట్లాడుతూ, "క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గెలుపు ఓటములు సహజమని క్రీడల్లో పాల్గొనడమే గొప్ప అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగోతి శ్రీనివాసులు పరిమి ఈశ్వరరావు వడ్లమూడి మాధవ పెదమాల కొండయ్య వెంగళాపురం ఎస్సీ కాలనీ యూత్ ఫోర్స్ పాల్గొన్నారు.

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర- తాళ్లూరు : జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మి, ప్రకాశ రావు, కామేశ్వర రావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ పి కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కోసనా గురు బ్రహ్మం, ఆర్.ఎ కాటూరి ప్రసాదలు ఆలయంలో భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

చంద్రబాబు సీఎంగా ఉండటం అదృష్టం

ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురికి వైద్య సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధి (సీ.ఎం.ఆర్.ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందించటం జరిగింది. ఆదివారం ఉదయం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి 35 మందికి రూ.63,30,330 రూపాయల చెక్కులను అందించడం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంతోషమే తన సంతోషంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని, ప్రజల గురించి, రాష్ట్రం గురించి ఇంతగొప్పగా ఆలోచించే నాయకుడు మనకు దొరకడం నిజంగా ఏపీ ప్రజల అదృష్టమన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఎవరూ దిగులు పడాల్సిన పనిలేదని, గత ప్రభుత్వంలో మాదిరి ఎవరూ ప్రాణాలు కాపాడుకోవడం కోసం ఆస్తులు అమ్ముకోవడం, అప్పులు చేయడం వంటివి కూటమి ప్రభుత్వంలో చేయాల్సిన పనిలేదన్నారు. ప్రజల వ్యక్తిగత సమస్యలతో పాటు, పాలనాపరమైన సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం త్వరలోనే కొత్త పరిష్కార వేదిక ఏర్పాటు చేయనుందన్నారు. అందరి చేతిలో ఉండే మొబైల్ లోని వాట్సాప్ ఫ్యూచర్ ద్వారా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేలా వివిధ శాఖలను అనుసంధానిస్తూ, ప్రభుత్వం త్వరలోనే నూతన విధానాన్ని అమల్లోకి తీసుకురానుందన్నారు. సాంకేతికను పాలనా పరమైన అంశాలకు జోడించడం ద్వారా ఇటు ప్రజలకు మేలు జరగడంతో పాటు, అటు రాష్ట్రాభివృద్ధి కూడా పరుగులు పెడుతుందన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ.25 వేలు అందజేసిన ఉప్పలపాటి

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం పేద ప్రజలకు అందించాలన్న తపనతో శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి చేస్తున్న కృషికి స్పందించిన పామూరు పట్టణ 8వ వార్డ్ మెంబర్ ఉప్పలపాటి హరిబాబు తన జన్మదినం సందర్భంగా ఆదివారం ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి 25 వేల రూపాయల విరాళమును అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి విరాళాలు అందజేసిన ఉప్పలపాటి హరిబాబు ను అభినందించి జన్మదిన శుభాకాంక్షలను ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని రాచర్ల రామాలయంలో ఆర్యవైశ్య సంఘం రాచర్ల మండల అధ్యక్షుడు ఎన్నిక నిర్వహించడం జరిగింది. రాచర్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లఘుమారపు సుబ్బారావు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు బోంతల సుధీర్ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరం ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగినది నూతన రాచర్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా అన్నంపల్లె గ్రామానికి చెందిన లఘుమారపు వెంకటరమణ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా అన్నంపల్లె గ్రామానికి చెందిన లఘుమారపు సుబ్బారావు ఉపాధ్యక్షుడు అనుమలవీడు గ్రామానికి చెందిన దర్శి శివప్రసాద్ సెక్రటరీగా లింగం రమేష్ ట్రెజరర్‌గా సాధుశిరాములు రాచర్ల మండలం ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోంతల సుధీర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పేరం ప్రసాద్ నూతన రాచర్ల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు లఘుమారపు వెంకటరమణకి నియామక పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన మాగులూరి శ్రీకాంత్ గత పది సంవత్సరాలుగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో పేదవారికి పేద విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్‌ను ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బోంతల సుధీర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పేరం ప్రసాద్ రాచర్ల మండల అధ్యక్షుడు లఘుమారపు వెంకటరమణ గౌరవ అధ్యక్షులు లఘుమారపు సుబ్బారావు రాచర్ల మండలంలోని ఆర్యవైశ్య సభ్యులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రూ.10వేలు విరాళం అందజేసిన 'పోకా'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని సుబ్బక్కపల్లికి చెందిన పోకా వెంకటేశ్వర్లు కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం ఆదివారం 10116 రూపాయలను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వగ్గంపల్లి టిడిపి నాయకులు ఉప్పుగండ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ మంజూరు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేములపాడు పంచాయతీ నందు గ్రామ ప్రజలు నీటికీ ఇబ్బంది పడుతున్న సందర్భంగా వేములపాడు సర్పంచ్ మల్లెల తిరుపతయ్య,ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కొణిదెల వెంకటేశ్వర్లు, చెక్కా హనుమంతరావు, గాయం కాసులు కలసి పంచాయతీ ఫండ్స్ ద్వారా పబ్లిక్ ట్యాప్ పైప్ లైన్‌ను సాంక్షన్ చేపించి ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో నీటికి ఇబ్బంది పడుతున్న సమస్యలను పరిష్కరించి పబ్లిక్ ట్యాప్‌లను సాంక్షన్ చేపించినందుకు ఎమ్మెల్యేకు మరియు మండల అధ్యక్షులకు, సర్పంచ్ కు గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు అనగా 20వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో డి ఈశ్వరమ్మ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం లో అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జడ్పిటిసి సభ్యుడు ఎంపీటీసీ సభ్యులు అన్ని గ్రామ పంచాయతీలు సర్పంచులు మండల స్థాయి అధికారులు సకాలంలో విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

మంత్రివర్గం నుండి అమిత్‌షాను తొలగించాలి

విశాలాంధ్ర-పామూరు : పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడినటువంటి అమిషాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని, అమిత్ షా విజయవాడ రాకను వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాపిత పిలుపు మేరకు ఆదివారం స్థానిక మమ్మీ డాడీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పి.ప్రభాకర్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, సిపిఐ నాయకులు ఆకుల మోహన్ రావు, ప్రసాదు, మహేష్, రఘునాథ రెడ్డి, రమణయ్య, సత్తారు సిపిఎం నాయకులు సయ్యద్ హనీఫ్, ఖాదర్బాషా, అల్లాబక్ష పాల్గొన్నారు.

ప్రైవేటు కార్యక్రమంలో గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన మేరువ పెద్దిరెడ్డి మాజీ సర్పంచ్ వారి సోదరి కుమారుడు కందుల కృష్ణారెడ్డి అంజలి కుమారి కూతురు చిరంజీవి విశ్విత ఓణీల ఫంక్షన్ కార్యక్రమానికి దర్శి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి కడియాల లలిత సాగర్ ఆదివారము హాజరై చిన్నారిని దీవించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు విరివిగా పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సమాజానికి ఆభరణం

గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఈ సమాజానికి ఆర్యవైశ్యులు గొప్ప ఆభరణం లాంటి వారని వారి సేవ లు వెలకట్టలేవని దర్శి టిడిపి కూటమి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ అన్నారు. మండలంలోని వేంపాడు ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా అమరా శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకార క్రమం వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గొట్టిపాటి లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ గ్రామాలలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేస్తూ ఆయా గ్రామాల అభివృద్ధిని, ఆ ప్రాంతాల అభివృద్ధి చెందాలన్న ఆర్యవైశ్యుల పాత్ర కీలకమన్నారు. మారినకాలంలో ఆర్యవైశ్యులకు దీటుగా కొందరు వ్యాపారాల నుంచి వచ్చినప్పటికీ ఆర్యవైశ్యులకు ఉన్న కమిట్మెంట్ ఇతర వర్గాలకు ఉండదని అన్నారు. సక్రమంగా జరిగేందుకు ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. గత ప్రభుత్వంలో ఎవరు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితి లేదన్నారు. వైసిపి పాలనలో బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్, దాడులు దౌర్జన్యా లతో వ్యాపారస్తులందరూ తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారన్నారు. జె.టాక్స్‌లతో పాటు, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేల టాక్స్ లు కూడా ఎక్కువైపోయి వ్యాపారాలకు అభద్రత పెరిగిపోయి వ్యాపారాలని మానేసి పక్క రాష్ట్రాలకు పారిపోయిన దౌర్భాగ్య

పరిస్థితుల నుండి ఇప్పుడిప్పుడే రాష్ట్రం కోలుకుంటుంది అన్నారు. కొంతమంది వచ్చి మనకు ఓట్లు వేయలేదని, మనకు వ్యతిరేకంగా పని చేశారని చెప్పగా, మన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ప్రభుత్వం కాదని మనది అభివృద్ధి చేసే ప్రభుత్వమని ఆమె అన్నారు. ఆర్యవైశ్యులకు మా ప్రభుత్వం మేము సంపూర్ణంగా అండగా ఉంటామని అన్నారు. యువకుడు, ఉత్సాహవంతుడు అమర శ్రీరామ్ మూర్తి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నియమితులు అవడం అన్నారు. దర్శి నియోజకవర్గ టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మాట్లాడుతూ ఆర్య వైశ్యుల హక్కుల కోసం, వ్యాపారాల కోసం, అభివృద్ధి కోసం, ఆయన కృషి ఉంటుందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని వారు కంటున్న కలలను మనం నిజం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారి బాటలో మనం పయనిద్దాం, అభివృద్ధి వైపు నడుద్దాం అని అన్నారు. ముందుగా ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. పూజారి దుర్భాకుల నగేష్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయం వద్ద నుండి సభ వద్దకు ఆర్యవైశ్య మహిళలు పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావు, ఎన్నికల అధికారి మువ్వల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాసరావు, మాజీ ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణ రావు, మాజీ జిల్లా కార్యదర్శి బొగ్గవరపు సుబ్బారావు, మాజీ అధ్యక్షులు కోట వెంకటేశ్వర్లు, మాజీ ఉప ప్రధాన కార్యదర్శి దేవతి వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు అమర నాగ భాను ప్రకాష్, మాజీ మండల అధ్యక్షులు పులికొండ శ్రీనివాసరావు, అద్దంకి మాజీ చైర్మన్ కోట శ్రీనివాసరావు, వాసవి దేవస్థానం చైర్మన్ ఊటుకూరి రామకోటేశ్వరరావు, వాసవి దేవస్థానం ధర్మకర్త దేవతి మహానంద పాల్గొన్నారు.

మానవతా సంస్థ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పామూరు : వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న ముగ్గురు పేదలకు 5000 రూపాయలు చొప్పున మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. చింతల పాలెం గ్రామానికి చెందిన వికలాంగురాలు అట్లూరి దయామణికి, పక్షవాతంతో బాధ పడుతున్న కోలా తిరుపాలుకి, వరికుంటపాడు గ్రామంలో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న సంచిబోయిన మాల్యాద్రికి ఆర్థిక సాయంను అందజేశారు. సంస్థ అధ్యక్షులు ఎం.ముసలయ్య, కార్యదర్శి ఎన్ బాబురావు, ట్రెజరర్ తోట రమేష్, కన్వీనర్ వి.వెంకటేశ్వర రెడ్డి, పూర్వఅధ్యక్షులు పి.తిరుపతి రెడ్డి, సేగు కృష్ణయ్య, కాకు నాగేశ్వర రావు పి.మాల్యాద్రి, షేక్ బాషా మొహిద్దీన్, ఎం.తిరుపతి రెడ్డి, వై.వెంకట సుబ్బయ్య, పి.రామకృష్ణ, పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మకి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలిసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగాభవాని అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువజామునే అమ్మవారికి పాల పొంగళ్ళు పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. నూతన వాహనములు కొనుగోలు చేసినవారు అమ్మవారి సన్నిధిలో వాహనములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

23న వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర అనే అంశంపై ఈ నెల 23వ తేదీన అన్ని పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వ హిస్తున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఎలిసాల కోటేశ్వరరావు, ఏడుకొండలు తెలిపారు. మండలస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఆసక్తి కలవారు 9573457801ను సంప్రదించాలన్నారు. విజేతలకు విలువైన బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మండలంలోని వేంపాడు వద్దగల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్ష ఎన్నికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర శ్రీరామ మూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆర్యవైశ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమాజంలో ఆర్యవైశ్యుల పట్ల ప్రజలకు ప్రత్యేకమైన గౌరవం అభిమానం ఉందని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన క్షేమం కోరే ప్రజలకు మన వంతు సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత ఉండాలన్నారు. ఆర్యవైశ్యులందరూ సమిష్టిగా ఒక తాటిపై నిలిచి కలిసికట్టుగా ఉండాలన్నారు. మన హక్కుల సాధన కోసం సంస్థ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పాటుపడాలని అన్నారు. అనంతరం సిద్దరాఘవరావును కమిటీ సభ్యులు దుశాలాతో పూలమాలలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. అనంతరం ముండ్లమూరు మండలం మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పులికొండ శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతుల కుమార్తె పులికొండ ప్రియాంకకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా పులికొండ ప్రియాంక కు అక్షింతలు వేసి దీవించారు. ఆర్యవైశ్య కార్పోరేట్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గర్లపాటి బ్రహ్మానందం, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం కోశాధికారి గర్లపాటి కృష్ణ, గర్లపాటి శ్రీనివాసరావు, గునుపూడి సురేష్, అమరా నాగేశ్వరరావు, అమరా వెంకటేశ్వర్లు, అమర కోటేశ్వరరావు, అమర శ్రీనివాసులు, మిత్తింటి పుల్లారావు, పొత్తూరి శీను, బొగవరపు జయంతు, మిత్తింటి అనిల్ పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటన వ్యతిరేకిస్తూ వామపక్షాలు నిరసన

విశాలాంధ్ర - చీరాల : రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూమ్ మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని పలువురు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శీతాకాల పార్లమెంటు సమావేశాలలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ని అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన దానికి నిరసనగా ఆదివారం చీరాల గడియార స్తంభం సెంటర్లో అమిత్‌షా గో బ్యాక్ అంటూ ప్రజాసంఘాలు,వామ పక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారత దేశంలో విభిన్న కులాలు,మతాలు, ఆచారాలు,సంప్రదాయాలు అందరినీ ఐక్యం చేసి కలిసిమెలిసి జీవించే విధంగా లౌకిక రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి హెూదాలో అమిత్ షా అవమానకరమైన అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని,అమిత్ షా ప్రజలను వేల సంవత్సరాల పాటు విడగొట్టిన మనువాద భావజాలంతోనే ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. రాజ్యాంగంపైన రూపకల్ప డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన గౌరవం,నమ్మకం లేని వ్యక్తి రాజ్యాంగ పదవులలో కొనసాగడానికి ఏమాత్రం అర్హుడు కాదని,కాబట్టి తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టి ప్రత్యేక హెూదా ఇస్తామని,ప్యాకేజీ ఇస్తామని తెలుగుప్రజలను నమ్మబలికి ఇప్పుడు ఇది ముగిసిపోయిన అధ్యాయం అని వ్యాఖ్యానించడం తెలుగు ప్రజలను అవమానించడమే అన్నారు. రాజ్యాంగంపైన,తెలుగు ప్రజల ,రాష్ట్రంపైన,విశ్వాసం లేని వ్యక్తి రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదన్నారు. డీ.నారప రెడ్డి,బీసీ ఫెడరేషన్ నాయకులు వెంకటేశ్వర్లు,దళిత బహుజన పార్టీ నాయకులు షేక్ జిలాని, బలహీన వర్గాల సమైక్య నాయకులు సామ్యూల్,పవన్ కుమార్ రెడ్డి, బాబూరావు, ప్రజా సంఘాల నాయకులు బడుగు విమలాకర్,బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ బాబుకి ఘన నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మండలంలోని గోపాపురం గ్రామస్తులు టీడీపీ మండల మహిళా నాయకురాలు దండమూడి సంధ్యారాణి భర్త దండమూడి ఆనంద్ బాబు మృతి చెందిన విషయం తెలుసుకుని వారి పార్థివ దేహానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద్ బాబుకి టీడీపీ కార్యక్రమాలను బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయ డంలో ముఖ్య పాత్ర పోషించేవారన్నారు. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబానికి అండగా ఉంటామని బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కావూరి శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు,దగ్గుమల్లి రాణీ,మాజీ ఎంపీటీసీ కాగిత నాగభూషణ కుమారి, టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - బల్లికురవ : నేటి నుండి ఈ నెల 31వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఈ శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పావని ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీన వెలమవారిపాలెం, కొత్తూరు,21న కూకట్లపల్లి, గొర్రెపాడు,22న కొప్పెరపాడు,ఎస్ ఎల్ గుడిపాడు,23న వైదన,కొమ్మినేనివారిపాలెం,24న వల్లాపల్లి,అంబడిపూడి,25న బల్లికురవ,గుంటుపల్లి,27న ముక్తేశ్వరం,చెన్నుపల్లి,28నకొప్పెరపాలెం,మల్లాయపాలెం,29ననక్కబొక్కలపాడు,కొనిదెన,30న వేమవరం,కే. రాజుపాలెం,31న ఉప్పుమాగులూరు గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల ద్వారా పశువులకు నట్ట నివారణ మందులు పంపిణీ,గర్భకోశ వ్యాధులకు చికిత్స,కృత్రిమ గర్భధారణ,సూడి పరీక్షలు తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లో జరిగే పశు వైద్య శిబిరాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ ఐకమత్యంగా ఉండాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఐక్యతగా ఉండాలని వారు సమావేశంలో తీర్మానించారు. ఐక్యతగా ఉంటేనే ఆయా పార్టీలలో క్రియాశీల పాత్ర పోషిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈనెల 26వ తేదీన అద్దంకిలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రోశయ్య, సురేష్,రమణబాబు, అశోక్,వరగాని రమేష్,సతీష్,ఆనంద్‌లు పాల్గొన్నారు.

త్రైమాసిక పన్నును చెల్లించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సాంకేతిక సమస్యలు అధిగ మించేందుకు గాను ఈ త్రైమాసిక పన్నును వారం రోజులు ముందుగానే చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి.కె.పరంధామ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 31వ తేదీన క్వార్టర్‌కు సంబంధించి ఈ నెల 31 లోపు చెల్లించాలని పన్నులను నేషనల్ సాఫ్ట్‌వేర్ ద్వారా చెల్లించవలసి ఉన్నందున ఇ-కెవైసి,మండల్ మాపింగ్‌లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వాహన యజమానులను ఆయన కోరారు. లేని యెడల పన్ను చెల్లించుట వీలు కాదన్నారు. ఇతర రాష్ట్రాల్లో కేసులు బకాయి ఉన్న యెడల పన్ను చెల్లింపుట వీలు కాదని వాటిని వెంటనే క్లియర్ చేసుకోవాలని తెలిపారు. చివరి రోజు వరకు వేచి ఉండకుండా సాంకేతిక సమస్యలను అధిక మిం చేందుకు వారం రోజులు ముందుగానే ఈ త్రైమాసిక పన్నును చెల్లించాలని రవాణా వాహన యజమానులను డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌ఫోర్టు అధికారి కోరారు.

హైందవ శంఖారావంతో చైతన్యం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఈ నెల 5వ తేదీన గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభ హిందూ బంధువుల చైతన్యంతో విజయవంతం అయ్యిందని ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ అన్నారు. కుల,రాజకీయాలకు అతీతంగా హిందువులందరూ సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. స్థానిక స్వర్ణ రోడ్డులో ఉన్న కళ్యాణ మండపంలో వీహెచ్‌పీ చందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశం మొత్తం చూసేలా సభ విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంచనాలకు మించి విజయవంతం అవడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సభ విజయవంతం కావడానికి కృషి చేసిన వారిని జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముప్పల వెంకట రమణారావు,పెద్దిరెడ్డి రామిరెడ్డి, తాడివలస దేవరాజు,గాదె శేష సాయి,సురేంద్ర,శ్రీనివాస్,మహేష్, తులసీరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ఇటీవల కాలంలో త్రిపురాంతకం మండల కేంద్రంలో గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. అయితే పోలీసులు ఆ మృతదేహం వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో త్రిపురాంతకం మండల కేంద్రానికి చెందిన మెండ్రగుత్తి మహంకాళి 35 కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం అందించారు. మహంకాళి సంబంధించిన ఆనవాలను పోలీసులు సేకరించారు. మృతదేహం ఒంగోలులో ఉండటంతో కుటుంబ సభ్యులను పరిశీలించగా మహంకాళిగా కుటుంబ సభ్యులు నిర్ధారించారు. దీనితో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందచేసినట్లు యస్ ఐ శివబసవరాజు తెలిపారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - చీరాల : భారత దేశంలో సిద్ధాంత పరంగా ఉన్న పార్టీ బీఎస్పీ మాత్రమేనని,బీఎస్పీని బూత్ స్థాయి నిర్మాణ దిశగా తీసుకువెళ్లి, బహుజనులందరు ఏకతాటిపైకి వచ్చేలా కృషి చేయాలని,బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిపోగు వందన కుమార్ అన్నారు. ఆదివారం నియోజకవర్గ బహుజన సమాజ్‌పార్టీ సమీక్ష సమావేశం స్థానిక ఐక్య నగర్ పార్టీ కార్యాలయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ కమీషనర్,బీఎస్పి రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కి పోగు వందన కుమార్ మాట్లాడుతూ దేశంలో 85శాతం పైగా బహుజనులు ఉన్నారని వారికి అధికారం వచ్చినప్పుడే అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగ ఫలాలు అందుతాయన్నారు. పూలే, అంబేద్కర్,కాన్షీరం సూచించిన మార్గంలో నడిస్తేనే దేశంలో బహుజన వర్గాలకు రాజ్యాధికారం సాధ్యమన్నారు. అనంతరం చీరాల పట్టణ బీఎస్పీ అధ్యక్షులుగా వల్లెపు వాసు,వేటపాలెం మండల బీఎస్పీ అధ్యక్షులుగా కలువ కళ్యాణ్‌ను నియమించారు. బహుజన సమాజ్ పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి కాటి మార్క్, నియోజకవర్గ అధ్యక్షులు రవికుమార్,బీఎస్పీ నాయకులు కోటేశ్వర రావు,భగత్ సింగ్, సంగీతరావు, మహేంద్ర, అనీల్,సుధాకర్,చంటి,వంశీ,అర్జునరావు,సతీష్,విన్సంట్, పృధ్వీ, సుబ్బారావు, విజయ్, శ్రీను,కుమారి,చిరంజీవి,బుజ్జి పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి ద్విచక్ర వాహనదారుడు మృతి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ట్రాక్టర్ కింద పడి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని భవనంవారి పాలెంలో ఆదివారం జరిగింది. చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం భవనంవారిపాలెం గ్రామానికి చెందిన కొండవీటి వెంకటప్రసాద్ (34) అనే వ్యక్తి ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై రెడ్డిపాలెం నుండి భవనంవారిపాలెం వైపు వెళుతున్న క్రమంలో అదే సమయంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనానికి తగలడంతో వెంకటప్రసాద్ ట్రాక్టర్ ట్రక్కు వెనుక చక్రాల క్రింద పడడంతో అతను తల పగిలి మెదడు బయటికి వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారని,మృతుడు వైజాగ్‌లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని అతని కుమారుని అన్న ప్రాసన నిమిత్తం భవనంవారిపాలెం గ్రామం వచ్చి చందోలు బండ్లమ్మ తల్లి గుడిలో మొక్కులు చెల్లించుటకు వారి కుటుంబ సభ్యులను గుడిలో వదిలిపెట్టి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదంలో వెంకట ప్రసాద్ మృతి చెందాడు అని చెప్పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా: ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - చినగంజాం : చిన్నగంజం మండలంలో ఆదివారం పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు పర్యటించారు.టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ కలాం ఆజాద్ సతీమణి సయ్యద్ ఖాజున్నీసా బీబీ ఇటీవలె మరణించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం అబ్దుల్ కలాం ఆజాద్ను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

తిరుమలదేవికి సావిత్రిబాయి పూలే నేషనల్ ప్రతిభా అవార్డు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంకు చెందిన కస్తూరిబా బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.తిరుమలదేవికి ఉపాధ్యాయ విద్యకు, పేద విద్యార్థులకు అందించిన సేవలకు గాను సౌథెర్న్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్పీ యల్ టీ ఓ) సంస్థ గౌరవధ్యక్షులు ఎమ్మెల్సీ కే. లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పాయర్థ, నాగయ్య చేతుల మీదుగా సావిత్రి బాయి పూలే నేషనల్ ప్రతిభా అవార్డు ను ఆదివారం గుంటూరు లోని వేంకటేశ్వర విజ్ఞాన మందిరం లో జరిగిన సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమం లో అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల దేవి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు, బాలికా విద్యభివృద్ధికి విశేషంగా కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ కృషి

విశాలాంధ్ర - కనిగిరి : పట్టణంలోని స్థానిక అమరావతి గ్రౌండ్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్ నందు నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి నందమూరి తారకరామారావు ఎనలేని కృషి చేశారని కూడు, గుడ్డ, గూడు, పేరుతో పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు అందించిన ఘనత ఒక్క ఎన్ టీ రామారావుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పడవ పోటీల్లో విజేతలకు సత్కారం

విశాలాంధ్ర-దాచేపల్లి : కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పడవ పోటీల్లో దాచేపల్లి మండలం రామాపురం మత్స్యకారుల జుట్టుకు ప్రథమ స్థానం వరించిన విషయం విదితమే. సంక్రాంతి పండగలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన రామాపురం జుట్టుకు ఆదివారం గుర జాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ద్వారా సేవలు అందించండి

జిల్లా ఆరవ అదనపు జడ్జి శుభవాణి

విశాలాంధ్ర-మార్కాపురం : లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా ఆరవ అదనపు జడ్జి ఎం శుభవాణి సూచించారు. మార్కాపురంలో ఆదివారం నూతనంగా ఏర్పాటుచేసిన లయన్స్ క్లబ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ నీరు అధికంగా ఉందని లయన్స్ క్లబ్ ద్వారా వీలైనన్నీ ఆర్ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేసి రక్షితనీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. సభ్యులందరూ యాక్టివ్ ఉండి సేవా కార్యక్రమాలు పాల్గొనాలని సూచించారు. అవకాశం ఉన్నప్పుడు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటామన్నారు. తాను చదువుకునేరోజుల్లో తన తల్లితోపాటు కుటుంబ సభ్యులతో లయన్స్‌క్లబ్‌లో జరిగే సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ 316హెచ్ జిల్లా గవర్నర్ పి గోపిచంద్ మాట్లాడుతూ మార్కాపురం లయన్స్ క్లబ్ ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురంలో క్లబ్ ఏర్పాటుకు కృషిచేసిన జోన్ ఛైర్మన్ పులి శ్రీనివాస ప్రసాదన్ను అభినందించినట్లు తెలిపారు. వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ హరిప్రసాదరావు మాట్లాడుతూ జిల్లా గవర్నర్ స్థాయిలో 12 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను మంజూరు చేయించేందుకు అవకాశం ఉన్నదని, ఆయా ప్రాజెక్టులకు అవసరమయ్యే వ్యయంతో 25 శాతం మార్జిన్ మనీ చెల్లించేందుకు ముందుకు వస్తే 75శాతం ఆర్థిక సాయం లయన్స్ ఇంటర్నేషనల్ చేస్తుందన్నారు.

క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన ఎపిజిబి విశ్రాంత బ్యాంకు మేనేజర్ టీవీ రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన హెచ్ ఎం ఎం చంద్రశేకర్ రెడ్డిలు మా ట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించేందుకు తమ వంతు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉపాధ్యక్షులుగా బార్ అసోషియేషన్ నాయకులు భూపని కాశయ్య, ఆర్ హరనాధబాబు, సహాయ కోశాధికారిగా డాక్టర్ మాధవరావు, సర్వీసు చైర్‌పర్సన్‌గా వి వెంకటరామిరెడ్డి, ఎల్సిఐఎఫ్ కోఆర్డినేటర్ బి కోటేశ్వరరావు, మెంబర్షిప్ కోఆర్డినేటర్ కె. చెంచిరెడ్డి, క్లబ్ మార్కెటింగ్ ఛైర్మన్‌పర్సన్గా షేక్ మహబూబ్ బాషా. అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్గా ఎం శివప్రసాద్ తోపాటు పలువురు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. జోన్ ఛైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్‌తో పాటు నామినేని మోహన్రావు, వెంకట సుబ్బయ్య, జియస్ కోఆర్డినేటర్ ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్ కనకదుర్గ, సయ్యద్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్ని విజేత త్రిపురాంతకం టీమ్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యార్రగొండపాలెం నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సంధర్భంగా వైఎస్సార్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసి క్రీడాకారులను ప్రోత్సహించిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అభినందనీయుడని దర్శి ఎమ్మెల్యే, వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసిన సంధర్భంగా ఆదివారం జిల్లా స్థాయిలో క్రికెట్ పోటీల్లో ప్రధమ స్థానం పొందిన త్రిపురాంతకం టింకు రూ.50 వేలు ప్రైజ్ మణితో పాటు క్రికెట్ టోర్నికప్, ద్వితీయ స్థానంలో నిలిచిన గంజివారిపల్లి టీమ్‌కు రూ.30 వేలు ప్రైజ్ మణితో పాటు క్రికెట్ టోర్నికప్, తృతీయ స్థానం

కైవసం చేసుకున్న కొత్తూరుకు రూ.20 వేలు ప్రైజ్ మణితో పాటు క్రికెట్ టోర్నికప్ అందజేశారు. ఈ సంధర్భంగా జరిగిన సభలో బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి క్రీడలను, యువతను ఎంతగానో ప్రోత్సహించారని చెప్పారు. ఇంకా వైసీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కరెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామావత్ అరుణాబాయి, పొన్నా వెంకట లక్ష్మమ్మ, సరళ కుమారి, కొప్పర్తి ఓబుల్ రెడ్డి, జబివుల్లా, కోటిరెడ్డి, ముసలారెడ్డి, ఆళ్ల ఆంజనేయరెడ్డి, పోలిరెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన డిఎస్పీ

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌ను దర్శి డిఎస్పీ బి లక్ష్మీనారాయణ ఆదివారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ముందుగా స్టేషన్ పరిసరాలను, గదులను, స్టేషన్ ఆవరణను, పాత పోలీస్ స్టేషన్లో ఆవరణలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. స్టేషనుకు వచ్చే కేసులు బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ గురించి ఎస్ ఐ వై నాగరాజు డీఎస్పీకి వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, అంకమ్మరావు, మరియబాబు, సూరి బాబు, ప్రేమ్ నిధి, మహేష్, హుస్సేన్, లక్ష్మీదేవి, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నూతన కమిటీలు పక్క ప్రణాళికతో నిర్వహించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్రంలో ప్రతి జిల్లాలో నియోజకవర్గాలలో నూతన కమిటీలు పక్క ప్రణాళికతో నిర్వహించాలని బిఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిపోగు వందనకుమార్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్లో బిఎస్పీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కి పోగు వందన కుమార్ హాజరుయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో నియోజకవర్గాలలో నూతన కమిటీలు పక్క ప్రణాళికతో నిర్వహించాలని,దీనికి బాధ్యతగా గతంలో ఉన్న బిఎస్పి జిల్లా నియోజకవర్గ నాయకులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకొని జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డులు,పంచాయతీలు, మారుమూల ప్రాంతంలో కూడా కమిటీలు వేసే దిశగా ప్రయాణం చేయాలని ఆదేశించారు. అనంతరం బిఎస్పీ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పక్కా ప్రణాళికతో కమిటీలు వేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సోదరులు కులమతాల కతీతంగా అందరూ కూడా పార్టీ బలోపేతానికి సహకరిస్తారన్నారు.

నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుదే రాజారావు మాట్లాడుతూ కుల గణన విషయంలో బీసీలకు పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచిన బిఎస్పీ పార్టీకి అభినందనలు తెలుపుతూ కులగణన లెక్క ఈ ప్రభుత్వాలు తేల్చే వరకు పూర్తిస్థాయిలో ఉద్యమ నిరసనకు సిద్ధంగా ఉన్నామన్నారు.బిసి రాష్ట్ర సమన్వయ కమిటీ ఆదేశాల మేరకు మేము కూడా పూర్తిస్థాయిలో కమిటీలకు సిద్ధంగా ఉన్నామని ఎక్కడ రాజీపడే ప్రసక్తే లేదని తెలిపారు.కులగణన లెక్కలు తేలే వరకు ఉద్యమం ఆగేదే లేదని పూలే అంబేద్కర్ కాన్షీరాం మహనీయులు ఆశయాలతో పూర్తి స్థా యిలో ముందడుగు వేయటానికి సిద్ధంగా ఉన్నా మని రాష్ట్రంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ సోదరులను కలుపుకొని కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ ఉప్పాల ఏలీయా,ఏపూరి జోసఫ్, శాంతమ్మ,జాన్ వెస్లీ తదితరుల పాల్గొన్నారు.

హెల్మెట్లు తప్పక ధరించాలి: ఏసీపీ

విశాలాంధ్ర-కంచికచర్ల: రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఏసీపీ తిలక్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కంచికచర్ల మండలం పరిధిలో కీసర స్వర్ణ టోల్ ప్లాజా వద్ద ఆదివారం వాహన దారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకుని నడపాలన్నారు. జాగ్రత్తలు పాటించడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు అన్నారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదానికి గురయితే మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై బి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో ఎంపికైన అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం మచిలీపట్నంలో జరిగాయని అధ్యక్షులు కేవీ లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలలో కేవీ లోకేశ్వరరావు అధ్యక్షునిగా, కేవీ రమణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గ సభ్యుల్లో పి.ఆదిశేషు సహాధ్యక్షునిగా, ఏ. శ్రీనివాసరావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా పివి. నాగేంద్రరావు, కెవిఎన్. ప్రసాద్, ఎంవిపి. శ్రీదేవి, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ వహాబ్, వి.శ్రీనివాసరావు, పి.రోజ, కోశాధికారిగా ఏ. సోమశేఖర్ ఎంపికయ్యారని నూతన అధ్యక్షులు కెవి. లోకేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎన్టీఆర్ కృషి

విశాలాంధ్ర - కనిగిరి : పట్టణంలోని స్థానిక అమరావతి గ్రౌండ్ నందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అమరావతి గ్రౌండ్ నందు నియోజకవర్గ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి నందమూరి తారకరామారావు ఎనలేని కృషి చేశారని కూడు, గుడ్డ, గూడు, పేరుతో పేదలకు కిలో బియ్యం రెండు రూపాయలకు అందించిన ఘనత ఒక్క ఎన్ టీ రామారావుకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

నేడు గొర్రెల మార్కెట్ యార్డు ప్రారంభం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలో గొర్రెల పెంపకం దారులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కనిగిరి పొగాకు బోర్డు కార్యాలయం ఎదురుగా గల గతంలో నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డును నేడు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభిస్తారని ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు తోడేటి గోపి తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర పశు సంవర్ధక సంచాలకులు పి.దామోదర్ నాయుడు, రాష్ట్ర షీప్ సొసైటీ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ రజినీ కుమారి , పశు సంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ కె బేబిరాణి పలువురు హాజరవు తున్నారని కావున జిల్లాలోని గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షుల పాల్గొని గొర్రెల మార్కెట్ యార్డు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

అంబేద్కర్‌ను అవమానించిన

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని సీపీఐ గన్నవరం పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషీ డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీ అధ్వర్యంలో నిరసన ప్రదర్శన తెలిపారు. ఈ సందర్భంగా జోషీ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాల న్నారు. గోబ్యాక్ అమిత్ షాట్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, పట్టణ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి, కార్యవర్గ సభ్యులు కట్టవరపు విజయరావు, కె.మోహన్ రావు, ఎన్.మోహన్ రావు, సహాయ కారుదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు కల్లం వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎం. అంజనేయులు, పి.నాగేశ్వరరావు, బడుగు మరియదాసు, కల్లం వెంకటేశ్వరరావు, ఏసుదాసు. మిరప నాగేశ్వరరావు, ఉదయ్, మద్దిరెడ్డి చిన్న, బేతపూడి మరియదాసు, ఏసు దాసు, సురగాని సాంబశివరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గుడివాడ : పార్లమెంట్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవమానిస్తూ ప్రసంగించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వామపక్షా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో వామపక్షా నాయకులు ఆర్‌సిపి రెడ్డి, చింతలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా మతోన్మాదం నశించాలన్నారు. దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తూ పార్లమెంట్లో ఆయన వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పార్లమెంట్లో తూట్లు పొడిచే విధంగా అమిత్‌షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రాజ్యాంగం వల్లే అమిషా హొం మంత్రి అయ్యారన్న విషయాన్ని మర్చిపోవడం బాధాకరమన్నారు. తక్షణం హొం మంత్రి చేసిన వ్యాఖ్య లు ఉపసంహరించుకొని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామ పక్షా నాయకులు కొమ్ము సురేష్, లంకా సురేంద్ర, ఆర్.కొండ, కోమరవోలు లక్ష్మణరావు, అరుణ, వేసపోగు యేసయ్య, నారా యణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు, వెంకటేశ్వరరావు, నాంచారయ్య, ఎలీషా రావు, తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమన రచనలు నైతిక విలువలకు పునాదులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జ్ఞానవంతమైన సమాజం కోసం ప్రతి వ్యక్తి ఆచరించాల్సిన నైతిక విలువలను వెయ్యేళ్ళ క్రితమే ప్రజా కవి వేమన తన రచనల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి వ్యక్తి ఎలా జీవించాలనే అంశాలపై ఎన్నో వచన కవిత్వాలు, పద్యాలు యోగి వేమన రచించారన్నారు. ఆయన పద్యాల్లో విశ్వదాభిరామ వినురవేమ అని వాక్యాన్ని తెలియని తెలుగువారు లేరన్నారు. యోగి వేమన తర్వాత తరంలో తెలుగు గడ్డపై జన్మించిన ఎంతోమంది కవులకు యోగివేమన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒక కవి అంతిమ లక్ష్యం సమ సమాజ స్థాపనే అనే అంశాన్ని 1000 సంవత్సరాల క్రితమే ఆయన ప్రబోధించారన్నారు. నేటి తరం కవులు, రచయితలు కూడా యోగివేమన ఆశించిన జ్ఞానవంతమైన సమాజ స్థాపన లక్ష్యంగా రచనలు చేయాలని సూచించారు. ప్రధానంగా నేటితరం విద్యార్థులు యోగివేమన రచించిన వేల పద్యాలను కంఠస్థం చేయడం ద్వారా తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. కుల మతాలకు అతీతమైన వేమన భావజాలాన్ని నేటి తరం పౌరులు తెలుసుకోవడం ద్వారా ప్రజా కవి యోగివేమన రచించిన పద్యాలకు సార్థకత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీనరసింహం డిఆర్‌డిఏ పీడీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు 'దామచర్ల' జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఒంగోలు శాసనసభ్యులు దామచ్ఛ జనార్ధన్ పుట్టినరోజు వేడుకలు నేడు ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యారు. ఒంగోలుతో పాటు కొత్తపట్నం, ఒంగోలు రూరల్ మండలంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు కటౌట్‌లను ఏర్పాటు చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు టీడీపీ కార్యకర్తలు దామచర్ల అభిమానులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గం నుంచి దామచర్ల జనార్ధన్ భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేసిన విషయం విధితమే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పడిన మొదటిసారిగా జరుపు కుంటున్న జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతు న్నాయి. ఒంగోలులోని వీకే ఆపార్ట్‌మెంట్‌లో దామచర్ల నివాసం ఉండే ప్రాంతంతో పాటు గుంటూరు రోడ్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అర్ధరాత్రి 12 తరువాత దామచర్ల నివాసంలో పార్టీ శ్రేణులు పెద్ద కేక్‌ను కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చి దామచర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

మాదిగ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: మాదిగ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించనున్నట్లు విస్సన్నపేట మాదిగ పేద విద్యార్థుల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. గత పది సంవత్సరాలుగా తమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 2024-25లో పదవ తరగతి, ఆపై సాంకేతిక విద్యనభ్యసించే మాదిగ విద్యార్థులంతా ఈ బహుమతికి దరఖాస్తు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, చాట్రాయి మండలాల పరిధిలో వీటిని అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9885641456, 9440352445 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సూరిరాజు, పి.ధనరాజు, కలపాల ముఖర్జీ ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

యోగి వేమనకు పుష్పాంజలి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: యోగి వేమన జయంతి సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీ రాజశేఖరబాబు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహితీ, సామాజిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మహనీయుడు యోగి వేమన, సమాజంలోని మూఢాచారా లను నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యే భాషలో పద్యాలను వినిపించి అందరిని మెప్పించిన మహాకవి వేమన అని పేర్కొన్నారు. వేమన ఒక ప్రజాకవి, సంఘ సంస్కర్త అని, ఆయన పద్యాలను వినని వారు, తెలియని వారుండరు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించు కోవడం, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని, వేమన ఆవిష్కరించిన నైతిక విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్‌తో పాటు, ట్రైనీ ఐ. పి. ఎస్. మనీషా, సి. పి. ఓ అధికారులు, పోలీస్ అధికారులు, సి.పి.ఓ.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

విశాలాంధ్ర-రెంటచింతల : గొట్టిముక్కల మేజరు వద్ద రాయపరెడ్డి పొలంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురైంది. రైతు రాయపరెడ్డి నిత్యం ట్రాన్సార్మర్ను కాపలాగా నిద్రిస్తూవుండేవాడు. శనివారం ఊరికి వెళ్లటంతో అగంతకులు ట్రాన్సార్మర్లోని రాగి తీగలను చోరీ చేశారు. సుమారు రూ. 2లక్షల వరకు రైతుకు నష్టం వాటిల్లుతుందని విద్యుత్తు శాఖాధికారులు భావిస్తున్నారు. వారం క్రితం గోగిరెడ్డి బాలిరెడ్డి నర్సరీలో సుమారు రూ.30వేల విలువ కల్గిన పురుగు మందులు దొంగలు తీసుకెళ్లారు.

దశాబ్దాల సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-పమిడిముక్కల: సోమవారం పామర్రు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వర్ల కుమార రాజా తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగే సమావేశంలో పామర్రు నియోజకవర్గ లోని ఆయా మండలాల సమస్యలతో పాటు దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యలు కూడా తెలియజేయవచ్చని ఈ కార్యక్రమానికి కలెక్టర్ డికే బాలాజీ, ఇతర శాఖల ముఖ్య అధికారులు, నాయకులు హాజరవుతారని తెలిపారు.

వేమన చరిత్రపై చలనచిత్రం నిర్మించాలి

- జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

విశాలాంధ్ర - బాపట్ల : యోగి వేమన పద్యాలు పలకని తెలుగువారుండరని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్‌లో ఆదివారం యోగివేమన చిత్రపటానికి సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి డి. గంగాధర్ గౌడ్ పూలమాలవేసి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ యోగి వేమన తెలుగు భాషలో భారతీయ తత్వవేత్త,కవి అని అన్నారు. వారి కవితలు సరళమైన భాష,స్థానిక యాసలను కలిగి ఉంటాయన్నారు. అందుకే వారి కవితలు పరిస్థితి చెందాయని అన్నారు. తెలుగువారు వేమన పద్యాలను వల్లేవేస్తూ ఉంటారన్నారు. యోగి వేమన జీవిత చరిత్రపై చలనచిత్రం కూడా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జివి శివలీల,సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే బోర్డు మెంబర్‌గా పఠాన్ రాజేష్ నియామకం

విశాలాంధ్ర - కర్లపాలెం : గుంటూరు రైల్వే బోర్డు మెంబర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నాయకులు అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్‌ను కర్లపాలెం మండలం టీడీపీ నాయకులు శాలువా,పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం అబ్దుల్ కలాం ఫౌండేషన్ కార్యాలయంలో ముస్లిం పెద్దలు,నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పఠాన్ రాజేష్ మాట్లాడుతూ రైల్వే బోర్డు మెంబర్‌గా తన నియామకానికి కృషిచేసిన ఎంపీ కృష్ణ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ బాషా,ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, హైదరాబాద్ వలి, షేక్ జిలాని, మాడా బుజ్జిబాబు, దిలీప్, షేక్ హబీబ్‌లు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసానిని కలిసిన మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గంలో రహదారులు, డ్రెయి న్లు సమస్యలు పరిష్కరించేందుకు కేంద్ర మంత్రిగా అండగా నిలవాలని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఆదివారం గుంటూరులో పెమ్మ సాని చంద్రశేఖర్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాలకొండయ్య మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో డ్రెయినేజీ సమస్యలు రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని తమవంతు సహకారం అందిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. అనంతరం గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తామన్నారు.

అమిత్ షా గోబ్యాక్ అంటూ నిరసన

విశాలాంధ్ర-మార్కాపురం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని, అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి మొదటి నుంచి భారత రాజ్యాంగమన్నా, లౌకికవాదమన్నా అలాగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్న కూడా వారికి ఏ మాత్రం గౌరవం, విశ్వాసం లేదని అన్నారు. అంబేద్కర్‌ను అంతర్జాతీయంగా మేధావిగా కీర్తించబడుతుంటే మరోవైపు బీజేపీ నాయకులు మాత్రం అందులోను ప్రభుత్వంలో ఉన్న అమిత్‌షా లాంటి సీనియర్ మంత్రి అంబేద్కర్‌ను అవమానకరంగా మాట్లాడటం దారుణమని అన్నారు. అంబేద్కర్‌ను దూషించిన అమిత్ షా ఒక్క క్షణం కూడా కేంద్ర మంత్రిగా ఉండే నైతిక హక్కు లేదని అన్నారు. అలాగే రాష్ట్ర పర్యటనకు వచ్చిన అమిత్ షా తిరిగి వెంటనే వెళ్లి పోవాలని నాసరయ్య డిమాండ్ చేశారు. సీపీఎం కార్యదర్శి డి సోమయ్య మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా మరోవైపు కులాలను, మతాలను రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు అనేక కుట్రలు పన్నుతుందని విమర్శించారు. గత 78 సంవత్సరాల కాలంలో ఎన్నడూ లేని విధంగా అట్టడుగు వర్గాలు, దళితులు, మైనార్టీలపై నేడు దాడులు జరుగుతున్నాయని, ఇది దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మత సామరస్యానికి మాయని మచ్చ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రదర్శన అనంతరం వామపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు దేవండ్ల శ్రీనివాస్, నాయకులు ఎస్‌కె కాశిం, దుప్పట్ల కాశయ్య, సీపీఎం నాయకులు డీకేఎం రఫి, గుమ్మా బాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా జనరల్ బోగీలు నాటిక

విశాలాంధ్ర - యద్దనపూడి : ఎన్టీఆర్ కళాపరిషత్ అనంతవరం గ్రామంలో అధ్యక్షులు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికలు నాలుగు రోజులు పాటు సాగిన నాటిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. పోటీల్లో ప్రథమ బహుమతిని సాయి ఆర్ట్స్, కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక కాగా, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యంగ్ థియేటర్ విజయవాడ వారి 27వ మైలురాయి, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా మైత్రి కళానిలయం గుంటూరు వారి బ్రహ్మ స్వరూపం, ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారి (అ) సత్యం నాటికలు ఎంపికయ్యాయి. జనరల్ బోగీలు నాటికలో సావిత్రమ్మగా నటించి ఉత్తమ నటిగా సురభి ప్రభావతికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా నూతలపాటి కాళిదాసు, కే. దేవేంద్ర ట్రాక్టర్ రాయల్ హరి చంద్రులు వ్యవహరించారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేయాలి

◆దలైలావా ఆరోగ్యాన్ని కాపాడాలి ◆ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలు చేయాలని హర్యానా సరిహద్దుల్లో అమరణ నిరాహారదీక్ష చేస్తున్న దలైలావా ఆరోగ్యాన్ని కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రా వీరారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవన్‌లో జరిగిన రైతు సంఘం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతు నాయకులు జగ్జిత్‌సింగ్ దలైలావా 55 రోజుల నుంచి ఆమరణ దీక్ష చేపడుతున్నా, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. రైతులు పండించిన పంటలకు కనీసం మద్దతు ధర పలికేలా చట్టం తేవాలన్నారు. ఇటీవల ప్రధాన మంత్రి మోడి ప్రవేశ పెట్టిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల పాలిట అత్యంత ప్రమాదకారిగా మారిందన్నారు. మార్కెటింగ్ సొసైటీలను రద్దు చేసి కార్పొరేట్ శక్తులకు కట్ట బెట్టాలని కేంద్రం చూస్తుందని మండి పడ్డారు. గత సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా మోడి ప్రభుత్వానికి తలవంచి పనిచేస్తున్నాయన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమిళ నాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఏఐకెఎస్ జాతీయ మహాసభలు ఏప్రిల్ నెలలో జరుగుతాయని చెప్పారు. సభ్యత్వాలు పూర్తి చేయాలని, గ్రామ శాఖలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్కాపురం నియోజకవర్గ ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పీవీ కొండయ్య మాట్లాడుతూ రైతు సంఘం సభ్యత్వం వసూళ్ల చేపడతామని, గ్రామాలలో కమిటీలు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ రైతు సంఘం అధ్యక్షులు శిగినం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి కె కోటేశ్వరరావు, నాయకులు సీహెచ్ పెద్ద సిద్దయ్య, క్రిష్టయ్య, కె కొండలు, శ్రీనివాసులు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కర్లపాలెం : దానగుణం దాతృత్వం మానవ జీవితంలో ఒక భాగమని కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇనకొల్లు పోలీసురావు పేర్కొన్నారు. ప్రతినెల పదిమందికి చేయూత ఇవ్వాలని ఉద్దేశంతో మినిస్ట్రీస్ నెలకొల్పమన్నారు. చైతన్య పర్చాలి అనే అంశంలో భాగంగా ఆదివారం పెద్దగొల్లపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న గాదె వెంకటరెడ్డి గిరిజన కాలనీలో పది మంది కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ పిల్లలని స్థానిక పాఠశాల పంపిస్తూ చక్కగా చదివించాలని, చదువు మాత్రమే జీవితాలను బాగు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, ఐ. నరేంద్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన నూతన ఆర్ఐ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ఒంగోలు పట్టణంలోని కలెక్టర్ ఆఫీస్ నుండి హెచ్‌ఎంపాడు మండలానికి ఆదివారం నూతనంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా గవద కట్ల కృష్ణ చైతన్య ప్రమోషన్ మీద జాయిన్ అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్ నందు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ఆర్ ఐ కృష్ణ చైతన్య మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేయడం జరిగింది.